సాక్షి
వనపర్తి

ఆదివారం । 16 । మార్చి । 2025



.. సహాయక చర్యలు

కార్మికుల ఆచూకీ కోసం ఎస్‌ఎల్‌బీసీలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

వివరాలు 8లో ▸

ఇఫ్తార్ 6-32 (ఆదివారం సాయంత్రం)

సహర్ 5-01 (సోమవారం తెల్లవారుజామున)

రంజాన్ వేళలు

గరిష్టం/కనిష్టం 39.8 /20.1

వాతావరణం

ఎండ తీవ్రత రోజురోజుకు పెరుగుతుంది. అప్పుడప్పుడు వేడి గాలులు వీస్తాయి. ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఏఐ ఆధారిత బోధన కేంద్రం ప్రారంభం



కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలం మనిగిల్ల ప్రాథమిక పాఠశాలలో ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) ఆధారిత బోధన కేంద్రాన్ని శనివారం జిల్లా మానిటరింగ్ అధికారి మహానంది ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడు, నాలుగు, ఐదోతరగతి విద్యార్థులకు భాషా నైపుణ్యాలు, గణిత సామర్థ్యాల మీద పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేందుకు ఏఐ విద్య ఉపయోగపడుతుందని వివరించారు. జిల్లాలోని 11 పాఠశాలలు ఎంపికకాగా.. అందులో మనిగిల్ల పాఠశాల ఉందని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ బాణం విష్ణు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు శాంతన్న, స్థానిక ప్రజాప్రతినిధులు తిరుపతిరెడ్డి, నర్సింహారెడ్డి, శ్రీనివాస్‌సాగర్, సురేష్, పల్లవి, హెచ్‌ఎం వెంకటేష్, రాముడు, లావణ్య, ఉపాధ్యాయ బృందం, గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

113 మంది విద్యార్థులు గైర్హాజరు



కొత్తకోట రూరల్: జిల్లావ్యాప్తంగా ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ప్రశాంత వాతావరణంలో కొనసాగుతున్నాయని డీఐఈఓ ఎర్ర అంజయ్య తెలిపారు. శనివారం జిల్లాకేంద్రంతో పాటు కొత్తకోటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, నివేదిత జూనియర్ కళాశాల, ప్రతిభ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. 4,917 మంది విద్యార్థులకుగాను 4,804 మంది హాజరయ్యారని.. 113 మంది గైర్హాజరైనట్లు వివరించారు.

డీఎంహెచ్‌ఓ ఆకస్మిక తనిఖీ



పెబ్బేరు రూరల్: మండలంలోని ప్రభుత్వ ఆస్పత్రిని శనివారం జిల్లా వైద్యాధికారి డా. అల్లె శ్రీనివాసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, పరిసరాలను పరిశీలించి సిబ్బందితో సమావేశమయ్యారు. అనంతరం మాట్లాడుతూ.. మండలంలోని నాలుగు ప్రైవేట్ వైద్యశాలలు, మూడు ల్యాబ్‌లు, 12 ప్రథమ చికిత్స కేంద్రాల్లో తనిఖీలు చేశామని చెప్పారు. స్థాయికి మించిన వైద్యం చేయరాదని ఆర్‌ఎంపీలు, పీఎంపీలను హెచ్చరించినట్లు వివరించారు. త్వరలోనే మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న కేంద్రాలను తనిఖీలు చేస్తామని చెప్పారు. ఆయన వెంట డిప్యూటీ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి బండారు శ్రీనివాసులు, హెల్త్ ఎడ్యుకేటర్ రవికుమార్, హెల్త్ అసిస్టెంట్ రాజశేఖర్ ఉన్నారు.

రామన్‌పాడులో 1,017 అడుగుల నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో శనివారం 1,017 అడుగుల నీటిమట్టం ఉన్నట్లు ఏఈ వరప్రసాద్ తెలిపారు. జూరాల ఎడమ కాల్వ నుంచి 69 క్యూసెక్కుల వరద కొనసాగుతుండగా.. సమాంతర కాల్వ నుంచి నీటి సరఫరా లేదని చెప్పారు. జలాశయం నుంచి ఎన్టీఆర్ కాల్వకు 131 క్యూసెక్కులు, కుడి, ఎడమ కాల్వలకు 55 క్యూసెక్కులు, తాగునీటి అవసరాలకు 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని వివరించారు.

ఆవిష్కరణలకు గుర్తింపు

పీయూలో పరిశోధనలపై దృష్టి సారించిన అధ్యాపకులు

- ఇప్పటికే కెమిస్ట్రీ విభాగంలో పూర్తిస్థాయి పేటెంట్ హక్కులు
- డిజైన్ విభాగంలో రెండు, యుటిలిటీలో ఒకటి, పరిశీలనలలో మరొకటి
- గుర్తింపు వస్తే పూర్తిస్థాయిలో కొత్త ఆవిష్కరణలకు అవకాశం



పాలమూరు యూనివర్సిటీ అధ్యాపకులు బోధనపైనే కాకుండా.. పరిశోధనలపై సైతం దృష్టిసారించారు. గత కొన్నేళ్లుగా సాగుతున్న పరిశోధనలతో పలు అంశాల్లో పేటెంట్ రైట్స్ సైతం సాధించారు. మొత్తం కెమిస్ట్రీ విభాగంలో అధ్యాపకులు పర్యావరణహిత రీ ఏజెంట్లు, ఎలాంటి కెమికల్స్ లేకుండా సాధారణ పర్యావరణానికి అనుకూలమైన విధానంలో తయారు చేయడం యూనివర్సిటీ చరిత్రలో ఓ మైలురాయి. దీనికి పేటెంట్ రైట్ రావడంతో టీచర్స్ అసోసియేట్ షిప్ ఫర్ రీసెర్చ్ ఎక్సలెన్స్ ఫెల్లోషిప్ అధ్యాపకులు చంద్రకిరణ్ ఎంపికయ్యారు. మ్యాథ్స్ విభాగంలో అధ్యాపకులు రిమోట్ కంట్రోల్ ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్ తయారీ, రోలర్ స్టాంప్ తయారీకి డిజైన్ విభాగంలో పేటెంట్ రాగా.. స్ట్రెచింగ్ షీట్‌పై కాసన్ నానోఫ్లూయిడ్స్ ప్రవాహంలో వేడి, ద్రవ్యరాశి బదిలీని పంచే పద్ధతి వంటివి ఇటీవలే ఆవిష్కరించారు. ఇవి పరిశీలన దశలో ఉండగా.. మరో ఆవిష్కరణను ఎంబీఏ అధ్యాపకులు ఆన్‌లైన్ ట్రేడింగ్ ప్రిడెక్టర్ వంటి పరికరాలు ఆవిష్కరించారు. దీంతో ఇటు అధ్యాపకులు రీసెర్చ్ స్కాలర్స్, పీజీ, ఎంబీఏ, ఎంసీఏ, ఫార్మసీ విద్యార్థులు పరిశోధనల అనంతరం ఒక కొత్త యంత్రాల ఆవిష్కరణతో జరిగే ప్రయోజనం వంటి అంశాలపై దృష్టిసారించారు.

– మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్

కీలకంగా పర్యావరణహిత రీ ఏజెంట్లు



పేటెంట్ రైట్ సర్టిఫికెట్ చూపిస్తున్న అధ్యాపకులు చంద్రకిరణ్, రీసెర్చ్ స్కాలర్ స్వాతి (ఫైల్)

రసాయన పరిశ్రమలు, ట్యాబ్‌లెట్లు, ఇతర పరిశ్రమల్లో కెమికల్స్ తయారు చేసేందుకు రీ ఏజెంట్లు ఎంతో కీలకంగా మారనున్నాయి. ఇందులో రీ ఏజెంట్లు మొదట తయారు చేసేందుకు పెద్ద పరిశ్రమలను స్థాపించడం, పెట్టుబడి, ఇతర పర్యావరణానికి నష్టం చేసే విధంగా ప్రక్రియ చేయాల్సి ఉంటుంది. కానీ, పీయూ కెమిస్ట్రీ విభాగం అధ్యాపకులు చేసిన ప్రయోగాలు పూర్తిగా పర్యావరణ హితం కానున్నాయి. సాధారణ గది ఉష్ణోగ్రతల వద్ద చిన్న గదుల్లో సైతం రీ ఏజెంట్లను శాస్త్రీయ పద్ధతిలో తయారు చేసే విధానాన్ని కొనుగొనడంతో మూడు నెలల క్రితం కేంద్ర ప్రభుత్వం పేటెంట్ రైట్ ప్రకటించింది. ఇందులో అధ్యాపకులు చంద్రకిరణ్, సిద్ధరామగౌడ్, రీసెర్చి స్కాలర్ స్వాతి భాగస్వాములయ్యారు. వీటితోపాటు మరో 20 రీఏజెంట్‌లో పరిశోధనలో ఉన్నాయి.

రిమోట్ కంట్రోల్‌తో ఆక్సిజన్..

పీయూ మ్యాథ్స్ విభాగంలో పేటెంట్ రైట్స్ దృష్టిసారించింది. ఇందులో డిజైన్ విభాగంలో శ్వాసకోశ రోగులకు ఆక్సిజన్ థెరపీ అందించేందుకు రిమోట్ కంట్రోలర్ ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్ రూపొందించారు. ఇందులో పేషెంట్ ఆరోగ్యం, పరిస్థితి తదితర అంశాలను కాన్సన్‌ట్రేటర్ పరిశీలించిన తర్వాత రోగికి ఆక్సిజన్ అందిస్తుంది. అయితే రోగికి మ్యానువల్ పద్ధతిలో ఆక్సిజన్ కాన్సన్‌ట్రేషన్ ద్వారా ఆక్సిజన్ సరఫరా చేయాలంటే ఇబ్బందికర పరిస్థితులు ఉండే నేపథ్యంలో కేవలం రిమోట్ కంట్రోల్ ద్వారా ఆక్సిజన్‌ను అవసరం మేరకు అందిస్తే ఇబ్బందులు తప్పనున్నాయి. ఇందులో పలు యూనివర్సిటీలకు చెందిన అధ్యాపకులు శంకర్‌రావు, మధు, భారతి, సత్తమ్మ, లిపిక, అరుంధతి పాలుపంచుకున్నారు.



డిజైన్ విభాగంలో పేటెంట్ పొందిన మ్యాథ్స్ అధ్యాపకుడు మధును సన్మానిస్తున్న వీసీ శ్రీనివాస్, రిజిస్ట్రార్ చెన్నప్ప (ఫైల్)

➪ రోలర్ స్టాంప్ పరికరాన్ని మ్యాథ్స్ విభాగం అధ్యాపకులు మధు ఆవిష్కరించగా.. పేటెంట్ రైట్ లభించింది. గణితం అంటే భయపడే పాఠశాల స్థాయి విద్యార్థులకు ఈ పరికరం ఎంతో ఉపయోగపడనుంది. దీని ద్వారా గణిత ప్రక్రియలను సులభతరం చేసేందుకు అవకాశం ఉంది.

➪ రసాయన శాస్త్రంలో కెమికల్స్ ప్రాసెసింగ్, ఏరో స్పేస్, బయో మెడికల్ ఇంజినీరింగ్ పారిశ్రామిక అనువర్తనాల్లో వేడి, ద్రవ్యరాశి బదిలీలో కీలకపాత్ర పోషిస్తున్న స్ట్రెచింగ్ షీట్‌పై కాసన్ నానో ఫ్లూయిడ్ ప్రవాహంలో వేడి, ద్రవ్యరాశి బదిలీని పెంచే పద్ధతిలో కూడా మ్యాథ్స్ విభాగంలో పరిశోధనలు పూర్తి కాగా పేటెంట్ రైట్ పరిశీలనలో ఉన్నాయి.

నానో టెక్నాలజీ బ్యాండేజీ..

సాధారణంగా గాయాలు త్వరగా తగ్గేలా సూక్ష్మజీవులను చంపేందుకు వినియోగించే బ్యాండేజీలు కొత్త విధానాన్ని ఆవిష్కరించడంలో పీయూ బాటనీ డిపార్ట్‌మెంట్ అధ్యాపకులు శివకుమార్‌సింగ్ సఫలమయ్యారు. సూక్ష్మజీవులను చంపే బ్యాండేజ్‌లో చెట్ల రసాయనాలను వినియోగించి నానోపార్టికల్స్ ఆవిష్కరించారు. వీటి ప్రభావం సూక్ష్మజీవులపై ఎలా ఉంటుందో నిరూపించారు. ఈ ప్రయోగంలో బెంగళూరుకు చెందిన సైంటిస్టులతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ ప్రయోగానికి 2023లో పేటెంట్ రైట్ అందుకున్నారు.



శివకుమార్‌సింగ్‌ను సన్మానిస్తున్న వీసీ శ్రీనివాస్ తదితరులు



అర్జున్‌కుమార్‌ను సన్మానిస్తున్న ఆడిట్ సెల్ డైరెక్టర్ చంద్రకిరణ్ తదితరులు (ఫైల్)

కీలకంగా స్టాక్ మార్కెట్ ప్రిడిక్టర్..

పీయూ ఎంబీఏ విభాగంలో ఆన్‌లైన్ ట్రేడింగ్ చేసే వారికి స్టాక్ మార్కెట్ ప్రిడిక్టర్ భవిష్యత్‌లో కీలక పరికరంగా మారే అవకాశం ఉంది. స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టే వారికి మంచి సాధనంగా మారుతుంది. దీని ద్వారా స్టాక్ మార్కెట్‌ను పరిశీలించడానికి ఏఐని వినియోగించనున్నారు. ఇది మార్కెట్ అంచనా వేసేందుకు ఇంటర్నెట్, సోషల్ మీడియాలో ఆర్థికపరమైన వార్తలు, మీడియా కథనాలను అంచనా వేసి ఏ కంపెనీ షేర్ మార్కెట్‌లో లాభాలు గడిస్తాయనే అంశంపై మిషన్ లెర్నింగ్, ఆల్గరిథమ్ ఆధారంగా సమాచారం ఇస్తుంది. ఇది అందించిన సమాచారం మేరకు ఏ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టవచ్చు అనే అంశంపై సమాచారం ఇస్తుంది. ఇందులో పలు కళాశాలలకు చెందిన సురేష్‌కృష్ణ, కన్నమ్మల్, గాయత్రి, అర్జున్‌కుమార్, కిరుబదేవి, సుమందీశ్వర్, రాజామణి పాల్గొనగా.. పీయూ అధ్యాపకులు అర్జున్‌కుమార్ కీలకంగా వ్యవహరించారు.

ప్రాధాన్యం ఇస్తున్నాం..



యూనివర్సిటీలో అధ్యాపకులు, ఇటు రీసెర్చ్ స్కాలర్ ఎంతో ఉత్సాహంగా పరిశోధనలపై దృష్టి సారిస్తున్నారు. ఇటీవల కొన్ని పేటెంట్లు కూడా వచ్చాయి. దీని ద్వారా పీయూకు ప్రాజెక్టులు, రీసెర్చ్ పరమైన అంశాల్లో ముందంజ వేస్తున్నాం. నిర్మాణంలో రీసెర్చ్ ఫెసిలిటీ భవనం ఉంది. అది అందుబాటులోకి వస్తే పీయూ రీసెర్చ్ హబ్‌గా మారనుంది. అందులో పూర్తిస్థాయిలో ల్యాబ్‌లో అధునాతన ప్రయోగ పరికరాలు అందుబాటులోకి తీసుకువస్తాం.

– శ్రీనివాస్, వైస్ చాన్స్‌లర్, పాలమూరు యూనివర్సిటీ

మరింత ఊతం..



యూనివర్సిటీలో రీసెర్చ్‌తో పాటు కొత్త ఆవిష్కరణలకు అధ్యాపకులు, రీసెర్చ్ స్కాలర్స్ కృషిచేయడం గొప్ప విషయం. భవిష్యత్‌లో రీసెర్చ్ ఫెసిలిటీ అందుబాటులోకి రానుంది. ఇంజినీరింగ్ కళాశాలకు రెగ్యులర్ అధ్యాపకులు రానున్నారు. దీంతో మరింత రీసెర్చ్ పెరగనుంది. పలు ప్రతిష్టాత్మక సంస్థలతో ఎంఓయూ చేసుకునేందుకు చర్చలు జరుగుతున్నాయి.

– మధుసూదన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ పీజీ కళాశాల, మహబూబ్‌నగర్

చంద్రగఢ్‌కు మరమ్మతు

యాసంగి పంటలకు తప్పిన నీటి ఇబ్బందులు



చంద్రగఢ్ ఎత్తిపోతల పథకం ప్రధాన పంప్‌హౌజ్

- నాగిరెడ్డిపల్లి, బెక్కర్‌పల్లి ఎత్తిపోతలకు మహర్దశ ఎప్పుడో?
- పూర్తిస్థాయి మరమ్మతుకు రూ.8 కోట్లతో ప్రభుత్వానికి నివేదిక

అమరచింత: తొమ్మిదేళ్లుగా మరుగునపడిన చంద్రగఢ్ ఎత్తిపోతల పథకానికి రూ.26 లక్షలతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. కొత్త స్టార్టర్, సర్వీసింగ్ బోర్డు, స్విచ్చులను ఏర్పాటుచేసి ఆయకట్టులో యాసంగి పంటలకు ఐదు రోజులుగా సాగునీటిని వదులుతున్నారు. వచ్చే వానాకాలంలో పూర్తిస్థాయిలో సాగునీరు అందుతుందనే ఆశలో ఆయకట్టు రైతులు ఉన్నారు. బోరుబావుల్లో నీటిమట్టం అడుగంటి యాసంగి వరికి నీరందడం లేదని.. ప్రస్తుతం ఎత్తిపోతల నీటిని వినియోగించి పంటలు కాపాడుకుంటామని రైతులు చెబుతున్నారు. చంద్రగఢ్ ఎత్తిపోతల పథకం పరిధిలో సుమారు 5 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని అంచనా వేసిన అధికారులు.. పైప్‌ల లీకేజీల కారణంగా కేవలం 600 ఎకరాలకు సాగునీటిని ఇవ్వగలుగుతున్నారు. ఏదేమైనా ఏళ్లుగా మరమ్మతుకు నోచుకోని చంద్రగఢ్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం హర్షణీయమని రైతులు చెబుతున్నారు.

15 వేల ఎకరాల ఆయకట్టుతో..

20 ఏళ్ల కిందట అమరచింత మండలం ఈర్లదిన్నె శివారులో కృష్ణానది బ్యాక్ వాటర్‌కు అనుసంధానంగా చంద్రగఢ్, బెక్కర్‌పల్లి, నాగిరెడ్డిపల్లి ఎత్తిపోతల పథకాలను నాబార్డ్ సహకారంతో 15 వేల ఎకరాలకు సాగునీరు అందించేలా రూ.50 కోట్లతో ప్రభుత్వం ఐడీసీ ద్వారా పనులు చేపట్టింది. ఆయా పథకాల ఆయకట్టుకు భూ అంతర్భాగంలో పైప్‌లైన్లు ఏర్పాటు చేసి సాగునీటిని అందించడంతో మోటార్ల వత్తిడికి పైప్‌లు తరచూ పగిలిపోతుండటంతో మరమ్మతులు చేపట్టలేక సదరు కాంట్రాక్టర్, ఐడీసీ అధికారులు చేతులేత్తేశారు. దీంతో వీటి నిర్వహణ, మరమ్మతుల బాధ్యతను ఆయకట్టు రైతులకు అప్పగించడంతో నిర్వహణ మరుగునపడింది. నాసిరకం పైప్‌లు వాడారంటూ సదరు కాంట్రాక్టర్‌పై అప్పట్లో కోర్టులో కేసు వేసినా ఫలితం లేకపోయింది. చంద్రగఢ్ ఎత్తిపోతలు మరుగునపడటం, నాగిరెడ్డిపల్లి, బెక్కర్‌పల్లి ఎత్తిపోతల ప్యానల్‌బోర్డులు కాలిపోవడంతో సాగునీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. కేవలం చంద్రగఢ్ పథకంలోని ఒక మోటారుతో అడపాదడపా సాగునీటిని వినియోగించుకునేవారు. రెండేళ్ల కిందట స్టార్టర్ కాలిపోవడంతో మరమ్మతులకు నోచుకోగా ఆయకట్టు రైతులు ఇబ్బందులుపడ్డారు. ప్రస్తుత ప్రభుత్వం రూ.26 లక్షలతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టడంతో సాగునీటి ఇబ్బందులు తొలిగాయి.

జీవం పోసినట్లయింది..



చంద్రగఢ్ ఎత్తిపోతల కింద మూడు ఎకరాల్లో వరి సాగుచేసే వాడిని. మరమ్మతులకు గురి కావడంతో రెండున్నర ఏళ్లుగా సాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడ్డాం. ప్రస్తుతం సాగునీరు వదులుతుండటంతో వరి పైరుకు జీవం పోసినట్లయింది.

– ప్రభాకర్, రైతు, చంద్రగఢ్

మిగిలిన పథకాలు బాగుచేయాలి..



చంద్రగఢ్ ఎత్తిపోతలకు చిన్న చిన్న మరమ్మతులు చేపట్టి యాసంగి పంటలకు నీరు అందించడం హర్షణీయం. రైతుల ప్రయోజనాలకు కాపాడేందుకు బెక్కర్‌పల్లి, నాగిరెడ్డిపల్లి ఎత్తిపోతల పథకాల మరమ్మతులకు సైతం నిధులు మంజూరు చేయాలి.

– రవి, రైతు, చంద్రగఢ్

ఎమ్మెల్యే చొరవతో ..



చంద్రగఢ్ ఎత్తిపోతల పథకం స్టార్టర్ కాలిపోయిందని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి విన్నవించాం. సంబంధిత అధికారులతో మాట్లాడి అంచనాలు పంపడం, రూ.26 లక్షలు మంజూరు చేయించి పనులు పూర్తి చేయడం జరిగింది. ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు ఎమ్మెల్యే చేసిన కృషి అభినందనీయం.

– సర్వారెడ్డి, అధ్యక్షుడు, చంద్రగఢ్ ఎత్తిపోతల సంఘం



కొత్తగా ఏర్పాటుచేసిన స్టార్టర్లు

నిధులకు ఎదురుచూపులు

నాగిరెడ్డిపల్లి, బెక్కర్‌పల్లి ఎత్తిపోతల పథకాల ప్యానల్ బోర్డులు కాలిపోవడంతో కొత్తవాటి ఏర్పాటుకు పాలకులు, అధికారులకు పలుమార్లు వినతులు ఇవ్వడంతోనే కాలం గడిచిపోయింది. ప్రస్తుతం మూడు ఎత్తిపోతల పథకాల మరమ్మతులకు ఇరిగేషన్‌శాఖ అధికారులు రూ.8 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. సమీపంలోనే కృష్ణానది ఉన్నా సాగునీరు అందక పొలాలు బీడుగా మారే పరిస్థితులు దాపురించాయి. పదేళ్ల పాటు పాలించిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం వీటిపై దృష్టి సారించలేదని.. ప్రస్తుత ప్రభుత్వమైనా ఎత్తిపోతల మరమ్మతులపై దృష్టి సారించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపాం..

చంద్రగఢ్‌తో పాటు బెక్కర్‌పల్లి, నాగిరెడ్డిపల్లి ఎత్తిపోతల పథకాల పూర్తిస్థాయి మరమ్మతులకు రూ.8 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. గతంతో ఐడీసీ, రైతుల భాగస్వామ్యంతో నిర్వహణ కొనసాగేది. ప్రస్తుతం ఐడీసీని తప్పించి ఇరిగేషన్‌శాఖకు అప్పగించడంతో మరమ్మతుల కోసం నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వానికి నివేదించాం. నిధులు మంజూరైతే టెండర్లు పూర్తిచేసి పనులు చేపడతాం.

– నారాయణ, డీఈ, నందిమళ్ల క్యాంప్

అభివృద్ధే లక్ష్యంగా ముందుకు..

- నమ్మకాన్ని వమ్ము చేయకుండా న్యాయం చేస్తా
- మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ

ఆత్మకూర్/అమరచింత/మదనాపురం: మహబూబ్‌నగర్ పార్లమెంటు పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలను కాదని ప్రజలు తనను గెలిపించారని.. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా న్యాయం చేస్తానని, అభివృద్ధే ధ్యేయంగా ముందుకుసాగుతానని ఎంపీ డీకే అరుణ అన్నారు. శనివారం ఆత్మకూర్ మండలం తిప్పడంపల్లి, బాలకిష్టాపూర్‌లో పార్టీ జెండాలను ఆవిష్కరించడంతో పాటు తిప్పడంపల్లిలో రూ.5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. అలాగే అమరచింత ఏడో వార్డులో ఎంపీ నిధులతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లు, మదనాపురం మండలం గోపన్‌పేటలో బీజేపీ జెండా ఆవిష్కరించి వివిధ పార్టీలకు చెందిన 40 మంది పార్టీలో చేరగా కండువాలు కప్పి ఆహ్వానించారు. ఆయా గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో ఎంపీ మాట్లాడుతూ.. కేంద్రం నిరుపేదలకు పీఎం ఆవాస్ యోజన కింద ఇళ్లు మంజూరు చేస్తే రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లని డ్రామాలు ఆడుతోందని మండిపడ్డారు. అర్హులందరికీ ఇళ్లు ఇప్పిస్తానని, గ్రామాల్లో హైమాస్ట్ వీధిదీపాలు ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్ బాటలోనే రేవంత్‌రెడ్డి పయనిస్తున్నారని.. కేంద్రానికి, ప్రధాని మోదీకి వ్యతిరేకంగా మాట్లాడమే పనిగా పెట్టుకున్నారని ధ్వజమెత్తారు. ఇచ్చిన హామీలు అమలు చేయడం చేతగాని పాలన సాగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పుర కేంద్రాల్లో తాగునీటి ఇబ్బందులు దూరం చేయడానికే కేంద్రం అమృత్ 2.0 పథకం తీసుకొచ్చిందన్నారు. ఎన్నికల హామీలో భాగంగా బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని పార్లమెంట్ సమావేశంలో ప్రస్తావించడం జరిగిందని తెలిపారు. జూరాల జలాశయంలో నీటినిల్వలు రోజురోజుకు పడిపోతున్నాయని.. వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని, తాత్కాలిక మరమ్మతులకు నిధులు అవసరం ఉంటే తనను సంప్రదించాలని సూచించారు. ఆత్మకూర్‌లో జరిగిన కార్యక్రమంలో నాయకులు బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి, అశోక్‌జీ, అశోక్‌భూపాల్, అనీల్‌గౌడ్, మనోహర్, రాము, ఎల్లన్న, విష్ణురెడ్డి, శ్రీనివాస్, అమరచింతో జరిగిన కార్యక్రమంలో మంగ లావణ్య, నారాయణపేట జిల్లా అధ్యక్షుడు సత్యయాదవ్, రవికుమార్, పద్మజారెడ్డి, మేర్వ రాజు, భాస్కర్, మరాఠి అశోక్, వెంకటేశ్వర్లు, గోపన్‌పేటలో జరిగిన కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూర్ మండలం తిప్పడంపల్లిలో మాట్లాడుతున్న ఎంపీ డీకే అరుణ

హక్కులపై అవగాహన ఉండాలి

వనపర్తి: వినియోగదారులు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ జి.వెంకటేశ్వర్లు సూచించారు. ప్రపంచ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం కలెక్టరేట్‌లోని పౌరసరఫరాలశాఖ అధికారి కార్యాలయంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. వినియోగదారులు ఎక్కడైనా, ఏవైనా వస్తువులు కొనేటప్పుడు నాణ్యత ప్రమాణాలు, గడువు ముగింపు తేదీని తప్పనిసరిగా పరిశీలించాలన్నారు. నేటి కాలంలో ఆన్‌లైన్ వేదికగా చాలా మోసాలు జరుగుతున్నాయని.. ఏదైనా కొనుగోలు చేసి మోసపోతే ఆన్‌లైన్ ద్వారానే వినియోగదారుల ఫోరంను సంప్రదించవచ్చన్నారు. డిజిటల్ విధానంలో ఫిర్యాదు చేయడంతో పాటు వర్చువల్ హియరింగ్‌తో సకాలంలో సత్వర న్యాయం పొందవచ్చని.. ఈ సేవలపై అందరూ అవగాహన కలిగి ఉండాలని కోరారు. పౌరసరఫరాలశాఖ అధికారి కాశీవిశ్వనాథ్, డీటీలు, ఇతర అధికారులు, వినియోగదారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ జి.వెంకటేశ్వర్లు

వైభవం.. అలివేలుమంగ రథోత్సవం


రథంపై ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు

- ఘనంగా గరుడవాహన సేవ
- భక్తి పారవశ్యంతో పులకించిన భక్తులు


అలంకరణలో ఉత్సవమూర్తులు

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ అలివేలు మంగతాయారు రథోత్సవం (విమాన రథోత్సవం) శుక్రవారం అర్ధరాత్రి అంగరంగ వైభవంగా సాగింది. ముందుగా శోభాయమానంగా అలంకరించిన గరుడ వాహనంపై వేంకటేశ్వరస్వామి, అలివేలు మంగతాయారు దేవతామూర్తుల ఉత్సవ విగ్రహాలను ఉంచి సన్నాయి వాయిద్యాలు, పురోహితుల వేదమంత్రోచ్చారణల నడుమ గర్భాలయం నుంచి ప్రధాన ద్వారం మీదుగా ఆలయ ఆవరణలోని రథం వద్దకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం రంగురంగుల పూలు, విద్యుద్దీపాలు, మామిడి తోరణాలతో ముస్తాబుచేసిన రథంపై ఉంచారు. రథం ముందు కుంభం పోసి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం భక్తుల గోవింద నామ స్మరణలు చేస్తూ ముందుకు లాగారు. సాంప్రదాయ రీతిలో ఆలయం ముందున్న దేవగుండు వద్దకు లాగి తిరిగి ఆలయానికి తీసుకొచ్చారు. రథోత్సవానికి ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. బంగారు ఆభరణాలు, కాగడాలు, విద్యుద్దీపాల వెలుతురులో స్వామి, అమ్మవార్లు ధగధగ మెరిసిపోతూ భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం మళ్లీ ఉత్సవ విగ్రహాలను గరుడ వాహనంపై గర్భగుడి తీసుకొచ్చారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే ప్రత్యేక అభిషేకం, బలిహరణం, హోమం తదితర పూజా కార్యక్రమాలు కొనసాగాయి.

అశ్వవాహనసేవ..

అలివేలు మంగతాయారు ఆలయంలో శనివారం రాత్రి అశ్వవాహనసేవ నిర్వహించారు. శోభాయమానంగా అలంకరించిన అశ్వవాహనంపై స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ఉంచి గర్భగుడి నుంచి దేవస్థానం ముందున్న మండపం వరకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. భక్తుల హరినామస్మరణ, పురోహితుల వేదమంత్రాలు, సన్నాయి వాయిద్యాలు, కాగడాల వెలుతురులో అశ్వవాహనం ముందుకు కదిలింది. స్వర్ణాభరణాల అలంకరణలో వేంకటేశ్వరస్వామి సమేత అలివేలు మంగతాయారు అశ్వవాహనంపై ఊరేగుతూ భక్తకోటికి దర్శనమిచ్చారు. విశేష దినోత్సవం సందర్భంగా గుట్టపైనున్న లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం వద్ద భక్తుల రద్దీ కనిపించింది. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానందాచారి, పాలక మండలి సభ్యులు వెంకటాచారి, సురేందర్, గోవిందు, అలువేలమ్మ, సుధ, మంజుల తదితరులు పాల్గొన్నారు.

■ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం వసంతోత్సవం, పూర్ణాహుతి, అవభృతస్నానం, రాత్రికి నాగబలి (నాగవెల్లి), ద్వాదశ ఆరాధన, సప్తావరణాలు, మహా ఆశీర్వచనం తదితర కార్యక్రమాలు జరగనున్నాయి. దీంతో అమ్మవారి ఉత్సవాలు ముగుస్తాయి.

రమణీయం.. రామలింగేశ్వరుడి రథోత్సవం

- కందూర్‌లో మార్మోగిన శివనామస్మరణ
- భారీగా తరలివచ్చిన భక్తజనం


అలంకరణలో స్వామివారి మూల విగ్రహం


రథోత్సవానికి హాజరైన భక్తజనం

అడ్డాకుల: మండలంలోని కందూర్ రామలింగేశ్వరస్వామి రథోత్సవం శుక్రవారం అర్ధరాత్రి రమణీయంగా సాగింది. ముందుగా గ్రామం నుంచి రామలింగేశ్వరస్వామి వెండి ముఖం, నాగపడగను మంగళవాయిద్యాలు, డప్పుచప్పుళ్ల నడుమ బాణసంచా కాలుస్తూ భక్తుల శివనామస్మరణతో ఆలయానికి తీసుకొచ్చారు. అక్కడ పూజారులు వాటికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలోని ఉత్సవ విగ్రహాలను మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ ఆలయం వెలుపలకు తీసుకొచ్చి అలంకరించిన రథంపై ఉంచారు. తర్వాత రథం ముందు పోలు పోసి ప్రత్యేక పూజలు నిర్వహించి రథాంగ హోమం చేసి హారతులిచ్చారు. శనివారం తెల్లవారుజామున అశేష భక్తజనం శివనామస్మరణ చేస్తూ మేళతాళాల మధ్య స్వామివారి రథాన్ని భక్తులు భక్తిశ్రద్ధలతో ముందుకు లాగారు. రథం ముందు భక్తులు భజనలు, కోలాటాలు చేస్తూ అందరిని అలరించారు. రథోత్సవానికి వివిధ ప్రాంతాల భక్తులు పెద్దసంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది. కార్యక్రమంలో ఆలయ ఈఓ రాజేశ్వరశర్మ, గ్రామపెద్దలు నాగిరెడ్డి, శ్రీహరి, రవీందర్‌శర్మ, దామోదర్‌రెడ్డి, రాములు, బుచ్చన్నగౌడ్, దేవన్నయాదవ్, మనోహర్, సత్తిరెడ్డి, అర్చకులు యాదగిరిశర్మ, తాళ్లపాక రామలింగశర్మ, శివశర్మ, మణికంఠశర్మ, రేవంత్‌శర్మ, వినయ్‌శర్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

అచ్చంపేట రూరల్: ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న ఓ వ్యక్తిపై శనివారం అచ్చంపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణంలోని పాతబజార్‌లో సివిల్‌సప్లయ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు వాహనాలను తనిఖీ చేస్తుండగా... అనుమానాస్పదంగా ఓ ఆటోలో 18 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. ఈ బియ్యం ఎవరివని విచారించగా ఎండీ ఉస్మాన్ అనే వ్యక్తి తెల్ల రేషన్ కార్డుదారుల నుంచి బియ్యం సేకరించి బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరకు అమ్ముకుంటాడని తేలింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రమేష్ తెలిపారు. కాగా కొంతమంది అధికార పార్టీ నాయకులు, అధికారులు కేసు నుంచి అసలు సూత్రధారులను తప్పించే ప్రయత్నాలు చేసినట్లు సమాచారం.

క్లుప్తంగా

సంప్‌లో పడి చిన్నారి మృతి


నాన్సీ(ఫైల్)

బల్మూర్: అప్పటివరకు అందరిని నవ్విస్తూ ఆడుకుంటున్న చిన్నారి సంప్‌లో పడి దుర్మరణం పాలైన ఘటన మండలంలోని కొండనాగుల గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన చింత మహేష్, సుస్మిత దంపతులు. వీరికి నాన్సీ(2) అనే కూతురు ఉంది. పక్కనే ఉన్న తాత బాలయ్య ఇంటికి ఆడుకుంటూ వెళ్లింది. అక్కడ చిన్నారిని ఎవరూ గమనించకపోవడంతో ఇంటి ముందు ఉన్న సంప్‌లో పడింది. కొంత సేపటికి గమనించిన కుటుంబ సభ్యులు చిన్నారిని సంప్‌లో నుంచి తీయగా అప్పటికే నీళ్లు మింగి ఊపిరాడక మృతి చెందింది. చిన్నారి మృతితో ఆకుటుంబంలో విషాదచాయలు అలుముకున్నాయి.

బావిలో పడి వ్యక్తి..


చంద్రయ్య (ఫైల్)

మిడ్జిల్: ప్రమాదవశాత్తు బావిలో పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మిడ్జిల్ మండలం వేముల గ్రామంలో శనివారం ఆలస్యంగా వెలుగుచూసింది. స్థానికుల వివరాల మేరకు.. వేములకు చెందిన రేవల్లి చంద్రయ్య (50) గురువారం రాత్రి గ్రామంలో నిర్వహించిన కాముడి దహనం కార్యక్రమానికి వెళ్లాడు. అర్ధరాత్రి 1గంటకు కాముడి దహనం ముగిసిన అనంతరం బుడిద తీసుకుని వస్తుండగా.. గ్రామ సమీపంలోని ఆలయం వద్ద ఉన్న బావిలో ప్రమాదవశాత్తు పడ్డాడు. ఈ విషయాన్ని ఎవరూ గమనించలేదు. అతడి కోసం కుటుంబ సభ్యులు వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. ఈ క్రమంలో శనివారం గ్రామ సమీపంలోని ఆలయం వద్ద ఉన్న బావిలో శవమై కనిపించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటికి తీశారు. మృతుడికి భార్య కళమ్మ, కుమారుడు శివకుమార్ ఉన్నారు. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమర్టం నిమిత్తం జడ్చర్ల మార్చురీకి తరలించినట్లు ఎస్‌ఐ శివనాగేశ్వర్ నాయుడు తెలిపారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తి..


రవీంద్రనాథ్‌రెడ్డి (ఫైల్)

ఉండవెల్లి: మండలంలోని అలంపూర్ చౌరస్తా నుంచి చెన్నిపాడుకు బైక్‌పై వెళ్తున్న రవీంద్రనాథ్‌రెడ్డి(38) అనే వ్యక్తి పెద్దపోతులపాడు స్టేజీ సమీపంలో అదుపు తప్పి కిందపడటంతో తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. బైక్‌పై అలంపూర్ చౌరస్తా నుంచి స్వగ్రామమైన చెన్నిపాడుకు బైక్‌పై వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో బైక్ అదుపు తప్పి కిందపడినట్లు చెప్పారు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలాన్ని పరిశీలించి అంబులెన్స్‌లో కర్నూలు ఆస్పత్రికి తరలించారు.

మహిళ ఆత్మహత్యపై కేసు నమోదు

జడ్చర్ల: మండలంలోని కోల్‌బాయితండాకు చెందిన పాత్లావత్ శారద(45) తన ఇంటిలో శుక్రవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ కమలాకర్ తెలిపారు. సీఐ కథనం మేరకు.. కోల్‌బాయితండాకు చెందిన శారద భర్త శంకర్ ఆరేళ్ల క్రితం మృతిచెందగా ఆమె తన కుమారుడు సంతోష్, కోడలు జ్యోతిలతో కలిసి జీవిస్తుంది. అయితే కొడుకు, కోడలు తనను వేధిస్తున్నారని తన తండ్రి మునావత్ తథ్యుతో వాపోయింది. ఈ క్రమంలోనే శారద ఆత్మహత్యకు కుమారుడు, కోడలు కారణమని అనుమానంతో శనివారం ఆమె తండ్రి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కొనసాగుతున్న సహాయక చర్యలు


సొరంగంలోకి తాగునీరు తీసుకెళ్తున్న సహాయక బృందాలు

ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్‌లో లభ్యం కాని కార్మికుల ఆచూకీ

- కనీసం ఆనవాళ్లు కూడా లభించని వైనం
- హైడ్రాలిక్ పవర్డ్ రోబో పనితీరుపైనే ఆశలు
- డీ1 జోన్ ప్రాంతంలో బలహీనంగా పైకప్పు
- 22 రోజులు శ్రమిస్తున్న సహాయక బృందాలు


సొరంగంలోకి లోకో ట్రైన్‌లో వెళ్తున్న అన్వి రోబోటిక్ సంస్థ బృందం

అచ్చంపేట/ ఉప్పునుంతల: శ్రీశైలం ఎడమగట్టు కాల్వ (ఎస్‌ఎల్‌బీసీ) సొరంగంలో చిక్కుకుపోయిన కార్మికుల కోసం అడుగడుగునా అన్వేషిస్తున్నారు. 22 రోజులు గడుస్తున్నా ఇంత వరకు వారీ ఆచూకీ దొరకలేదు. మానవ ప్రయత్నంలో కొంత ఇబ్బందులు ఎదురవుతుండటంతో ఏఐ టెక్నాలజీ ద్వారా అన్వి రోబోటిక్ సంస్థ అభివృద్ధి చేసిన అటానమస్ హైడ్రాలిక్ పవర్డ్ రోబోకు అనుసంధానంగా 30 హెచ్‌పీ సామర్థ్యం గల పంపు, వాక్యూమ్ ట్యాంకు ద్వారా సహాయక చర్యలు కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు శనివారం వాటిని సొరంగం వద్ద సాంకేతిక పరిజ్ఞానంతో ఇన్‌స్టాలేషన్ చేసే ప్రక్రియ మొదలుపెట్టారు. మరోవైపు సాంకేతిక సమస్యలతో రోబో యంత్రాల పనితీరు ఇంకా ప్రారంభం కాలేదు. డీ2 ప్రదేశం నుంచి డీ1 వరకు సింగరేణి, ఎన్‌డీఆర్‌ఎఫ్, హైడ్రా, ర్యాట్ హోల్ మైనర్స్ ఇతర సహాయక బృందాలు మట్టి, బురద తొలగించే పనిలో నిమగ్నమయ్యారు. టీబీఎం ఎర్త్ కట్టర్ ఉన్న ప్రాంతం పూర్తిగా 40 అడుగుల మేర కూరుకుపోయింది. అక్కడి వరకు మనుషులు వెళ్లి సహాయక చర్యలు చేపట్టడం ఇబ్బందికరంగా ఉంది. టీబీఎం విడి భాగాలను ప్లాస్మా కట్టర్‌తో తొలగిస్తున్నారు. డీ1 డేంజర్ జోన్ ప్రాంతంలో పైకప్పు బలహీనంగా ఉండటంతో కాంక్రీట్ సెగ్మెంట్ కూడా పడిపోయే పరిస్థితి గమనించి సింగరేణి గనుల్లో ఉపయోగించే టైగర్ కారడ్స్ కలప దుంగలను సపోర్టుగా చేసుకుంటూ తవ్వకాలు జరిపేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటి వరకు వీటిని నాలుగు చోట్ల ఏర్పాటు చేశారు. వీటికి సుమారు 40 టన్నుల బరువు ఆపగలిగే శక్తి ఉంది. ప్రమాదం జరిగే ముందు శబ్దం వస్తుందని, దీని వల్ల కార్మికులు సురక్షితంగా తప్పించుకునే అవకాశం ఉంటుందని సింగరేణి కార్మికులు వెల్లడించారు. డీ1 ప్రదేశానికి వెళ్లడానికి ఇంకా 30 మీటర్ల మట్టిని తొలగిస్తే సహాయక బృందాలు అక్కడికి చేరకుంటాయి. డీ1 వద్దకు చేరుకుంటే తప్ప తప్పిపోయిన కార్మికుల ఆచూకీ లభ్యమయ్యే పరిస్థితి కనిపించడం లేదు. డీ1 వద్ద పూర్తిస్థాయిలో మట్టిని తీసేందుకు మరింత సమయం పట్టే అవకాశం ఉంది. మరో రెండు, మూడు రోజుల్లో ఆచూకీ లభ్యమయ్యే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

మార్గనిర్దేశనం చేస్తున్నాం..

ప్రమాద ప్రదేశంలో చిక్కుకున్న వారిని గుర్తించేందుకు అన్ని ప్రయత్నాలు జరుగుతున్నాయని డిజాస్టర్ మేనేజ్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్‌కుమార్ అన్నారు. శనివారం ఉదయం సొరంగంలోని పరిస్థితులపై కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్‌తోపాటు సహాయక బృందాల ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. సొరంగంలో జరుగుతున్న పురోగతిపై సమీక్షించి అవసరమైన మార్పులను అమలు చేస్తూ మార్గనిర్దేశనం చేస్తున్నట్లు వెల్లడించారు. సహాయక బృందాల మధ్య సమన్వయంతో పనులు చేపడుతున్నామని, మరింత వేగవంతం చేసేందుకు అత్యాధునిక రోబోటిక్ పద్ధతులను ఉపయోగిస్తున్నట్లు చెప్పారు. అన్వి రోబోటిక్ సంస్థ అభివృద్ధి చేసిన అటానమస్ హైడ్రాలిక్ పవర్డ్ రోబో ద్వారా 30 హెచ్‌పీ సామర్థ్యం గల పంపుతో అనుసంధానమైన వాక్యూమ్ ట్యాంకు ఉపయోగించి నీటితో కూడిన బురద, మట్టిని తొలగించనున్నట్లు తెలిపారు. సొరంగంలోని నీటిని తొలగించేందుకు డీ-వాటరింగ్ ప్రక్రియ కొనసాగుతుండగా ఆధునిక పరికరాలు ఉపయోగించి శరవేగంగా సహాయక చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. ప్రత్యేకంగా ఆక్సిజన్ సరఫరా, వైద్యసేవలు, ఆహారం, మంచినీరు వంటి అవసరాలను నిరంతరం అందుబాటులో ఉంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రాధాన్యంగా సహాయక బృందాల భద్రతకు దృష్టిలో పెట్టుకుని అత్యవసర అవసరాలపై ప్రత్యేక దృష్టిసారించామన్నారు. అనంతరం లిక్విడ్ రింగ్ వాక్యూమ్ పంపు, వాక్యూమ్ ట్యాంక్‌తో కూడిన మిషన్ పనితీరు పరిశీలించారు.

పండ్లకు భలే గిరాకీ

- ఉపవాసదీక్షలతో పెరిగిన వినియోగం
- రిటైల్‌గా జోరందుకున్న వ్యాపారం
- అమాంతంగా పెరిగిన ధరలు


దుకాణంలో విక్రయానికి సిద్ధంగా ఉన్న పండ్లు

స్టేషన్ మహబూబ్‌నగర్: రంజాన్ మాసంలో పండ్లకు గిరాకీ ఎక్కువగా ఉంటోంది. మిగతా రోజుల కంటే ఈ మాసంలో పండ్ల వినియోగం అధికంగా ఉండడంతో ధరలు కూడా అంతేస్థాయిలో ఉన్నాయి. అరటి పండ్ల డజన్ ధర గత వారంతో పోలిస్తే రూ.5 నుంచి రూ.10 వరకు పెరిగింది. ద్రాక్ష పండ్లు అయితే కిలో రూ.80 నుంచి రూ.100 వరకు విక్రయిస్తున్నారు. డిమాండ్ ఎక్కువగా ఉండడంతో ద్రాక్ష పండ్ల ధరలు పెరగడానికి కారణమని వ్యాపారులు అంటున్నారు. రంజాన్ మాసంలో ఎక్కువగా వినియోగించే కర్బుజా (పుచ్చకాయ) పండు కిలో రూ.20 నుంచి రూ.25 వరకు విక్రయిస్తున్నారు. రిటైల్ మార్కెట్లో పండ్ల విక్రయాలు జోరందుకున్నాయి. రంజాన్ ఉపవాసదీక్షలో ముస్లింలు రోజు సాయంత్రం ఇఫ్తార్ వేళ పండ్లు ఎక్కువగా తీసుకుంటారు. యాపిల్, ఖర్జూర, పుచ్చకాయలు, పైనాపిల్, దానిమ్మ, ద్రాక్ష, బత్తాయి, బొప్పాయి, అరటి, సపోట వంటి పండ్ల వినియోగం పెరగడంతో వీటి ధరల్లో రోజురోజుకు మార్పు కనిపిస్తుంది. ముస్లింలకు ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందులకు భారీఎత్తున పండ్లు అవసరమవుతాయి. దీనిని దృష్టిలో ఉంచుకొని పండ్ల ధరలను అమాంతంగా పెంచేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని బస్టాండ్, అశోక్ టాకీస్ చౌరస్తా, జనరల్ ఆస్పత్రి, న్యూటౌన్, క్లాక్‌టవర్, అంబేడ్కర్ చౌరస్తా, పద్మావతికాలనీతోపాటు ఇతర ప్రాంతాల్లో పండ్ల స్టాళ్లను ఏర్పాటు చేశారు. రూ.20 నుంచి 25 వరకు ఉన్న యాపిల్ రంజాన్ మాసంలో రూ.30 నుంచి 35 వరకు, ఆరెంజ్ పండ్లు డజన్ ప్రకారం రూ.180 నుంచి 200 వరకు అమ్ముతున్నారు.

మార్కెట్లో వివిధ రకాల పండ్ల ధరలు	
యాపిల్	రూ.25-30(ఒకటి)
ద్రాక్ష	రూ.80-100(కిలో)
దానిమ్మ	రూ.25-30(ఒకటి)
బత్తాయి	రూ.15-20(ఒకటి)
బొప్పాయి	రూ.50-60 (కిలో)
ఖర్బూజ	రూ.20-25 (కిలో)
అరటి	రూ50-60(డజన్)
సపోట	రూ.40-50 (కిలో)

ధరలు అందరికీ అందుబాటులో ఉండాలి



రంజాన్ మాసంలో ఉపవాస దీక్షల సందర్భంగా పండ్ల వినియోగం ఎక్కువగా ఉంటుంది. ఈసారి కూడా పండ్ల ధరలు ఎక్కువగానే ఉన్నాయి. పెరిగిన ధరలతో పండ్లను కొనుగోలు చేయలేని పరిస్థితి. పండ్ల ధరలు పేద, మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో ఉంటే బాగుంటుంది.

– జహంగీర్‌బాబా, సద్దల్‌గుండు, మహబూబ్‌నగర్

దారిదోపిడీకి యత్నించిన ముఠా అరెస్ట్





వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ , స్వాధీనం చేసుకున్న బంగారు, వెండి ఆభరణాలు

- 10 తులాల బంగారం, 22 తులాల వెండి ఆభరణాల స్వాధీనం
- వివరాలు వెల్లడించిననాగర్‌కర్నూల్ ఎస్పీ

నాగర్‌కర్నూల్ క్రైం: జల్సాలకు అలవాటుపడి దారి దోపిడీకి యత్నించిన ఓ ముఠాను అరెస్ట్ చేసినట్లు ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ తెలిపారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో సమావేశం ఏర్పాటుచేసి వివరాలు వెల్లడించారు. వనపర్తికి చెందిన బొల్లెమోని బాబు, బొల్లెమోని అంజి, పుట్టపాకుల శ్రీకాంత్, హైదరాబాద్‌కు చెందిన నందిమళ్ల హరిగణేశ్, యాత రవి, పెంట్లవెల్లికి చెందిన గిరిధర్‌నాయుడు, సాయికుమార్, హరికృష్ణ, అఖిల్ జల్సాలకు అలవాటుపడి చోరీలకు పాల్పడుతుండేవారు. పెంట్లవెల్లికి చెందిన రాజవర్ధన్, వెంకటేశ్వర్లు, రమేష్, రాఘవేంద్రాచారి బంగారు వ్యాపారులు. వీరంతా ఈ నెల 6న బంగారు కొనుగోలుకు హైదరాబాద్ బయలుదేరారు. నిందితుడు సాయికుమార్ ఈ సమాచారాన్ని బొల్లెమోని బాబుకు అందించడంతో పాటు హరికృష్ణ, గిరిధర్ నాయుడుకు ఓ అద్దె కారు, సెల్‌ఫోన్ అప్పగించి బంగారు వ్యాపారస్తుల కారు వెంటే వెళ్తూ ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని సూచించారు. ఆ వ్యాపారులు హైదరాబాద్‌లోని కాశీకమాన్ వద్ద బంగారు కొనుగోలు చేసి బయలుదేరగా నిందితులు మిగతా వారిని అప్రమత్తం చేయడంతో పాటు వారి వెంటే వచ్చారు. కొల్లాపూర్ మండలం అంకిరావుపల్లి శివారు కేఎల్‌ఐ వంతెన వద్ద స్వామి, అంజి రాళ్లు అడ్డుపెట్టడంతో పాటు సిమెంట్ దిమ్మెలను, అఖిల్ తల్వార్‌ను చేతిలో పట్టుకోవడంతో పాటు హరిగణేష్, రవి, శ్రీకాంత్ రోడ్డు పక్కన నిలిచి ఉన్నారు. బంగారు వ్యాపారుల కారు అక్కడికి చేరుకోగానే నిందితులు కారుపై సిమెంట్ దిమ్మెలతో దాడి చేసేందుకు యత్నించగా అప్రమత్తమైన డ్రైవర్ చాకచక్యంగా అక్కడి నుంచి వేగంగా తప్పించుకొని వెళ్లిపోయారు. బంగారు వ్యాపారి రాజవర్ధన్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని గాలింపు చేపట్టారు. శుక్రవారం రాత్రి కొల్లాపూర్‌లో పెట్రోల్‌బంక్ వద్ద వాహన తనిఖీలు చేపడుతుండగా బొల్లెమోని బాబు అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తమదైన శైలిలో విచారించగా నేరాన్ని అంగీకరించడంతో పాటు మిగతా వారి సమాచారం ఇవ్వడంతో ఏడుగురిని అరెస్టు చేశారు. వీరంతా వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో 24 చోట్ల చోరీలకు పాల్పడినట్లు ఒప్పుకున్నట్లు తెలిపారు. నిందితుల నుంచి వేర్వేరు దొంగతనాలకు సంబంధించి 10 తులాల బంగారు, 22 తులాల వెండి ఆభరణాలు, దారి దోపిడీకి యత్నించిన కారు, రెండు మోటారు సైకిళ్లు, ఏడు సెల్‌ఫోన్లు, కత్తిని స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తామని.. కోర్టు అనుమతితో మరోమారు పోలీస్ కస్టడీకి తీసుకొని విచారిస్తామని చెప్పారు.

షార్ట్ సర్క్యూట్‌తో వస్త్ర దుకాణం దగ్ధం

రూ. 3లక్షల ఆస్తినష్టం

మక్తల్: షార్ట్ సర్క్యూట్‌తో వస్త్ర దుకాణం దగ్ధమైన ఘటన మక్తల్ పట్టణంలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. ఊట్కూరు మండలం తిప్రాస్‌పల్లికి చెందిన అశోక్ మక్తల్‌లోని సంగం బండ రోడ్డులో బట్టల షాపు నిర్వహిస్తున్నారు. రోజు మాదిరిగానే శనివారం రాత్రి 8 గంటలకు షాపును మూసివేసి ఇంటికి బయలుదేరారు. అతడు వెళ్లిన కొద్ది సేపటికే షాపులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. విషయం తెలుసుకున్న అశోక్ అక్కడికి చేరుకొని ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. ఫైర్‌స్టేషన్ సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అప్పటికే దుకాణంలోని సగానికి పైగా వస్త్రాలు కాలిపోయాయి. దాదాపు రూ. 3లక్షలకు పైగా ఆస్తినష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయారు. దగ్ధమైన షాపును సీఐ రాంలాల్, ఎస్‌ఐ బాగ్యలక్ష్మీరెడ్డి పరిశీలించారు.


దగ్ధమైన వస్త్ర దుకాణం

తాళం వేసిన ఇంట్లో చోరీ

బిజినేపల్లి: మండలంలోని లట్టుపల్లిలో కృష్ణమోహన్ ఇంట్లో చోరీ జరిగింది. స్థానికుల కథనం మేరకు.. గ్రామంలో కిరాణ దుకాణం నిర్వహిస్తున్న కృష్ణమోహన్ ఇంటికి తాళం వేసి శుక్రవారం యాదాద్రికి వెళ్లారు. శనివారం తిరిగి ఇంటికి వచ్చి చూసే సరికి తాళం తీసి ఉంది. లోపలికి వెళ్లి చూడగా మూడున్నర తులాల బంగారం, రూ.50 వేలు చోరీ అయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

క్లుప్తంగా

కడుకుంట్లలో వైద్య శిబిరం



వనపర్తి రూరల్: మండలంలోని కడుకుంట్ల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో కిష్టగిరి, కడుకుంట్ల, మెంటెపల్లి గ్రామాలకు చెందిన 90 మందికి వైద్యులు క్షయ, అయాసం, ఉబ్బసం, ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించామని సీహెచ్‌ఓ చంద్రకళ తెలిపారు. వారిలో ఐదుగురికి పాజిటివ్ రావడంతో వారికి మందులు ఇచ్చామని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ జయప్రద, ఏఎన్‌ఎం విద్యావతి, రేడియో గ్రాఫర్ లక్ష్మీనారాయణ, ఖాజా, సురేందర్‌గౌడ్, ఆశాకార్యకర్తలు సునీత, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



మదనాపురం: మండల కేంద్రంలోని వడ్డెర కాలనీలో ఎరుకలి పరశురాముడు ఇంటి నుంచి శాంతన్న ఇంటి వరకు రూ.4 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణాలను శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్డె కృష్ణ, వడ్డె బాలస్వామి, పరశురాముడు, చిన్నకురుమన్న, వెంకటేష్, లక్ష్మన్న, శాంతన్న పాల్గొన్నారు.

రంజాన్ ఉపవాస దీక్షలు



ఆత్మకూర్: పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ఉపవాస దీక్షలు చేపట్టిన ముస్లింలకు శనివారం రాత్రి స్థానిక మస్జిదే సయ్యదియాలో జాఫర్, లతీఫ్, అన్వర్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఖలీల్, రఫీఖ్, సిరాజ్, రియాజ్‌అలీ, రహ్మతుల్లా, మస్తాన్, ఆటోమొబైల్ ఇస్మాయిల్, ఫిరోజ్, కరెంట్ ఇస్మాయిల్, రఫీ, సాధిఖ్ దీక్షాపరులు పాల్గొన్నారు.

'ప్రతిపక్షాల గొంతు నొక్కుతున్నారు'



ఆత్మకూర్: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయలేక కాంగ్రెస్ ప్రభుత్వం ప్రశ్నించే గొంతుకలను నొక్కుతుందని మాజీ ఎంపీపీలు శ్రీధర్‌గౌడ్, బంగారు శ్రీను, విరేశలింగం, పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మీకాంత్‌రెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవికుమార్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక గాంధీచౌక్‌లో మాజీమంత్రి జగదీశ్వర్‌రెడ్డికి మద్దతుగా రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో కోటేష్, రామకృష్ణ, చెన్నయ్య, సోంబాబు, జానకీరాం, రియాజ్, విష్ణురెడ్డి, అంజి ఉన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



గోపాల్‌పేట: మండల కేంద్రంలోని చంద్రగట్టులో ఉపాధి కూలీలు చేస్తున్న పనులను శనివారం ఎంపీడీఓ శంకర్‌నాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా గట్టుపై తవ్వుతున్న కందకాలు, ఇతర పనులు పరిశీలించి ఫీల్డ్ అసిస్టెంట్ చెప్పిన విధంగానే పనులు చేయాలని కూలీలకు సూచించారు. పని ప్రదేశంలో వడగాల్పులు, దెబ్బలు తగిలితే వెంటనే కూలీలకు ప్రాథమిక చికిత్స అందించి, సమీప ఆస్పత్రులకు తరలించాలని సూచించారు. రోజూ మస్టర్లు వేయాలన్నారు. పనులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ రిజిస్టర్లలో పనులు నమోదు చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్ రాములును ఆదేశించారు.

ఎమ్మార్పీఎస్ నిరసన

ఆత్మకూర్: రాష్ట్రంలో ఏ, బీ, సీ, డీ వర్గీకరణ పూర్తయిన తర్వాతే గ్రూప్ 1, గ్రూప్ 2, గ్రూప్ 3 తదితర నియామకాలు చేపట్టాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక గాంధీచౌక్‌లో మండల అధ్యక్షుడు దండు శ్రీనివాసులు ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్షలు నాల్గో రోజు కొనసాగాయి. వారికి బీఆర్‌ఎస్ నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో అజ్జిపాగ లక్ష్మణ్, సోంబాబు, జానకీరాం, జహంగీర్, రామకృష్ణ, మాసన్న, కృష్ణకుమార్, గాలిపంపు శ్రీను, కిషోర్, రాము, అనిల్, వెంకటన్న, కురుమూర్తి, బీఆర్‌ఎస్ నాయకులు రవియాదవ్, విరేశలింగం, లక్ష్మీకాంత్‌రెడ్డి, రామకృష్ణ, చెన్నయ్య, అంజి తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ బడుల్లో మెరుగైన విద్య



పాన్‌గల్‌లో తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు, విద్యార్థులు

పెబ్బేరు రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని ఎంఈఓ జయరాములు అన్నారు. మండలంలోని బునియాదిపూర్ ప్రాథమికోన్నత పాఠశాలను ఆయన శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఒంటిపూట బడులు ప్రారంభమయ్యాయని, ఉదయం 8 గంటలకు విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రార్థన సమయానికి హాజరు కావాలని సూచించారు. మధ్యాహ్నం 12:30 గంటలకు పిల్లలకు భోజనం వడ్డించి, వారు తిన్న తర్వాతనే వదిలిపెట్టాలన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంఈఓ మాట్లాడుతూ పీఎంశ్రీ పథకంలో బునియాదిపూర్ గ్రామానికి చెందిన ప్రాథమికోన్నత పాఠశాల ఎంపికవడంపై హర్షం వ్యక్తం చేశారు. అదేవిధంగా పాఠశాలలో ప్రీ ప్రైమరీ ఎడ్యుకేషన్‌లో భాగంగా ఎల్‌కేజీ, యూకేజీ తరగతులు నిర్వహిస్తున్నామని, ఆట, పాటలతో చిన్నారులు విద్య నేర్చుకునే అవకాశాన్ని తల్లిదండ్రులు వినియోగించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నాగేషు, ఉపాధ్యాయు లు దయానంద్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పాఠశాలల బలోపేతానికి కృషి

పాన్‌గల్: ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య అందుతుందని, ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలని పాన్‌గల్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం పద్మ అన్నారు. శనివారం పాఠశాలల్లో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షణ పొందిన ఉపాధ్యాయులు, ఉచిత పుస్తకాలు, భోజనం అందుతాయన్నారు. తమ పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి తల్లిదండ్రులు తోడ్పాటునందించాలన్నారు. అనంతరం విద్యార్థుల ప్రగతి వివరాలను తల్లిదండ్రులకు వివరించారు.

విద్యాప్రమాణాలు పెంపొందించాలి

ఖిల్లాఘనపురం: విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు పెంపొందించేందుకు కృషిచేయాలని ఎంఈఓ జయశంకర్ తెలిపారు. శనివారం మండలంలోని ఆముదంబండతండా, గార్లబండతండా, షాపురం ప్రాథమిక పాఠశాలలను ఆయన పరిశీలించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడి పాఠశాలల్లోని సమస్యలు, పరిస్థితులు తదితర వివరాలను తెలుసుకున్నారు. విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడి మధ్యాహ్న భోజనం, ఉపాధ్యాయులు పాఠాలు చెప్పే విధానంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎంఈఓ ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతు ప్రాథమిక స్థాయి నుంచి విద్యార్థుల విద్యాప్రమాణాలు పెంపొందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. చదవడం, రాయడం, పదాలు పలకడం, గణితంలో కూడికలు, తీసివేతలు, గుణకారం, భాగహారం తదితర వాటిని నేర్పించాలన్నారు.

ఇసుక డంపులు స్వాధీనం



గోవిందహళ్లి వద్ద అధికారులు సీజ్ చేసిన ఇసుక డంపు



దొంతికుంటతండా శివారులో..

ఖిల్లాఘనపురం: మండలంలోని దొంతికుంటతండా శివారులో డంపు చేసిన ఇసుకను శనివారం సీజ్ చేసినట్లు పోలీసులు, రెవెన్యూ అధికారులు తెలిపారు. మండలంలోని రుక్కన్నపల్లికి చెందిన కేతావత్ సంతోష్, నక్క నరేష్ అక్రమంగా ఇసుకను ఫిల్టర్ చేసి దొంతికుంటతండా సమీపంలో డంపు చేసినట్లు ఎస్‌ఐ సురేష్‌గౌడ్ చెప్పారు. ఇసుక డంపును గుర్తించి నిందితులను తహసీల్దార్ సుగుణ ఎదుట బైండవర్ చేసినట్లు తెలిపారు. తహసీల్దార్ సూచనల మేరకు డంపు చేసిన మూడున్నర ట్రాక్టర్ల ఇసుకను సీజ్ చేశామన్నారు. అక్రమంగా ఎవరైనా ఇసుకను తరలిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు.

మదనాపురం: మండలంలోని గోవిందహళ్లిలో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపులను శనివారం తహసీల్దార్ అబ్రహంలింకన్, ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి సీజ్ చేశారు. గుర్తుతెలియని వ్యక్తులు ఇచ్చిన సమాచారం మేరకు.. కొంతకాలంగా గుట్టుచప్పుడు కాకుండా ఊకచెట్టు వాగు నుంచి ఇసుక తీసుకొచ్చి డంపు చేసి రాత్రి వేళలో ఇతర ప్రాంతాలకు విక్రయిస్తున్నారని పక్కా సమాచారం పోలీసులకు అందడంతో పోలీసులు దాడులు చేశారు. గ్రామానికి చెందిన నరేందర్‌రెడ్డి ఇసుక తరలిస్తున్నట్లు గుర్తించి, సుమారు 30 ట్రాక్టర్ల ఇసుక సీజ్ చేశామని పేర్కొన్నారు. అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

'బీఆర్‌ఎస్ నిరసనలు సిగ్గుచేటు'



మాట్లాడుతున్న ఎన్‌జే బోయేజ్

కొత్తకోట రూరల్: గతంలో సభా మర్యాదలు పాటించడం లేదని దేశంలో ఏ శాసనసభ వ్యవహరించని రీతిలో బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్‌ను ఏడాది పాటు సస్పెండ్ చేసిన విషయాన్ని బీఆర్‌ఎస్ నాయకులు మర్చి మాట్లాడుతున్నారని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌జె.బోయేజ్, పట్టణ అధ్యక్షుడు మేస్త్రీ శ్రీనివాసులు అన్నారు. మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డిని సస్పెండ్ చేసిన తీరును వ్యతిరేకిస్తూ బీఆర్‌ఎస్ శ్రేణులు చేస్తున్న నిరసనలు వారు అసంతృప్తి వ్యక్తం చేశారు. శనివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గతంలో అసెంబ్లీలో ప్రజా సమస్యలపై గళమెత్తిన సంపత్‌ను సస్పెండ్ చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ నాయకులు చేస్తే ఒప్పు.. కాంగ్రెస్ చేస్తే తప్పు అనే రీతిలో బీఆర్‌ఎస్ రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేయడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో సీడీసీ మాజీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎల్లంపల్లి నరేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సనాతన ధర్మ పరిరక్షణే లక్ష్యం



అయ్యప్ప ఆలయ కమిటీ కార్యవర్గం

వనపర్తిటౌన్: సమాజంలో సనాతన ధర్మ పరిరక్షణే లక్ష్యంగా ముందుకు సాగేందుకు అయ్యప్ప ఆలయ కమిటీ పని చేస్తోందని ఆలయ నూతన అధ్యక్షుడు, అయ్యప్ప సేవార్థి ముత్తుకృష్ణ గురుస్వామి అన్నారు. శనివారం వనపర్తి అయ్యప్ప ఆలయ సేవా సమితి నూతన కమిటీని ఏకగ్రీవకంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు అయ్యప్ప మాలాధారణలో సుదీర్ఘ అనుభవం ఉన్న ముత్తుకృష్ణ గురుస్వామిని అధ్యక్షుడిగా, ప్రధాన కార్యదర్శిగా చీర్ల కృష్ణసాగర్, కోశాధికారిగా పాపిరెడ్డి, ప్రచార కార్యదర్శిగా నరేందర్‌శెట్టి ని ఎన్నుకున్నారు. కమిటీ నిర్మాణంలో కాగితాల లక్ష్మీనారాయణ, వెంకటయ్య గురుస్వాములు కీలకంగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ముత్తుకృష్ణ మాట్లాడుతూ తల్లిదండ్రులకు, గురువులకు తొలి ప్రాధాన్యంతో లోకమంతా సుభిక్షంగా ఉండాలనే సనాతన ధర్మ మార్గాన్ని నేటి తరానికి తెలియజేయాల్సి అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు రమేష్ శర్మ, అయ్యప్ప ఆలయ కమిటీ ప్రతినిధులు, దాతలు తదితరులు పాల్గొన్నారు.

మోడల్ 'జీపీ' నిర్మాణానికి స్థలం కొరత

అమరచింత: ఇందిరమ్మ మోడల్ గ్రామ పంచాయతీ భవనాన్ని మండల కేంద్రంలో నిర్మించాలని ప్రభుత్వం ఆదేశించినా.. స్థానిక అధికారులు స్థలం చూపేందుకు నిరాకరించడంతో హౌసింగ్ అధికారులు వెనుదిరిగారు. ఇందిరమ్మ మోడల్ జీపీ నిర్మాణం కోసం స్థలం ఇవ్వాలని కోరుతూ శనివారం హౌసింగ్ డిప్యూటీ ఈఈ విఠోబా ఎంపీడీఓతో కలిసి తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. తహసీల్దార్ రవియాదవ్ మాట్లాడుతూ తమ కార్యాలయ ఆవరణంలో స్థలం లేదని, మున్సిపల్ కార్యాలయ ఆవరణంలో స్థలం ఉందని చెప్పడంతో అధికారులు అక్కడికి వెళ్లారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం మోడల్ జీపీ కట్టాలని ఇందుకు స్థలం ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ రవిబాబుకు కోరారు. ఇందుకు ఆయన నిరాకరించారు. తమ కార్యాలయ ఆవరణలో నర్సరీతో పాటు పార్కు ఏర్పాటు చేస్తున్నామని, తమకే స్థలం సరిపోదని చెప్పడంతో హౌసింగ్, మున్సిపల్ కమిషనర్ల మధ్య వాదనలు చోటుచేసుకున్నాయి. చేసేదేం లేక హౌసింగ్ అధికారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. మున్సిపాలిటీలో ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురవుతున్నా పట్టించుకోని అధికారులు ఇందిరమ్మ మోడల్ జీపీ నిర్మాణం కోసం స్థలం ఇవ్వలేమనడంపై పలువురు అభ్యంతరం తెలిపారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



పెద్దగూడెంతండాలో ఎండిన పంటను పరిశీలిస్తున్న నాయకులు

వనపర్తి రూరల్: సాగునీరు అందక యాసంగిలో సాగుచేసిన పంటలు ఎండిపోతున్నాయని, రైతులను ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం(ఏఐకేఎస్) రాష్ట్ర నాయకుడు ఎండీ జబ్బార్, జిల్లా అధ్యక్షుడు బాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని పెద్దగూడెంతండాలో బోర్ల కింద సాగు చేసి నీరు లేక ఎండిపోయిన పంటలను తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తండాలో 20 మంది రైతులు దాదాపు 50 ఎకరాలు వరి సాగు చేశారని, భూగర్భజలాలు తగ్గిపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని రైతులు వారికి వివరించారు. ఒక ఎకరాకు రూ.20 వేలకు పైగా పెట్టుబడులు పెట్టామని వారు వాపోయారు. ప్రభుత్వం స్పందించి ఎండిపోయిన వరి పంటకు ఎకరాకు రూ.20 వేలు నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు దేవేందర్, రైతులు సోమ్లానాయక్, జామిని, కోటమ్మ, నారాయణనాయక్, బోజనాయక్, రాధ తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వ్యక్తులపై కేసు నమోదు

ఖిల్లాఘనపురం: పాత కక్షలు మనసులో పెట్టుకుని అల్లుడు, కూతురిపై దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ వెంకటనాగరాజు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. మండలంలోని ఉప్పరిపల్లికి చెందిన కుర్వ నవీన్‌కుమార్, భార్య కుర్వ చంద్రకళతో కలిసి శుక్రవారం గ్రామ శివారులోని తమ పొలం సర్వే నెంబర్ 199 లో భూమికి సంబంధించిన హద్దు రాళ్లు ఏర్పాటు చేస్తున్నారు. ఈ సమయంలో కుర్వ చంద్రకళ తల్లిదండ్రులు కుర్వ శాంతన్న, కుర్వ శాంతమ్మ పొలం వద్దకు వచ్చి హద్దురాళ్లు ఏర్పాటు చేస్తున్న వారితో గొడవ పెట్టుకుని దూషించడంతో పాటుగా శాంతన్న రాయి తీసుకుని నవీన్‌కుమార్ తలపై దాడి చేశాడు. ఈ ఘటనలో నవీన్‌కుమార్‌కు రక్తగాయాలయ్యాయి. శనివారం బాధితులు ఇద్దరు పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని గాయపర్చిన శాంతన్న, శాంతమ్మపై ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ వెంకటనాగరాజు తెలిపారు.

కార్మికుల బకాయి వేతనాలు చెల్లించాలి



మాట్లాడుతున్న హనుమంతునాయక్

వనపర్తి రూరల్: గ్రామ పంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న 5 నెలల వేతనాలను వెంటనే చెల్లించాలని గ్రామ పంచాయతీ వర్కర్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు హనుమంతునాయక్ కోరారు. జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మండ్ల రాజు మాట్లాడుతూ.. పంచాయతీ కార్మికులకు అయిదు నెలలుగా వేతనాలు చెల్లించకపోతే కుటుంబ పోషణ ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. ప్రతి నెల 1న వేతనాలు చెల్లిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించినా.. వేతనాలు అందక కార్మికులు పస్తులతో కాలం వెళ్ల దీస్తున్నారని వాపోయారు. గత ప్రభుత్వంలో 24 రోజుల సమ్మె చేసిన సందర్భంగా శిబిరాల వద్దకు వచ్చిన కాంగ్రెస్ నాయకులు మేము అధికారంలోకి వస్తే కనీస వేతనం రూ.26 వేలు ఇస్తామని చెప్పారని గుర్తుచేశారు. మార్చి 19న జరిగే అసెంబ్లీ బడ్జెట్ సందర్భంగా కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని, మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పుష్ప, హనీఫ్, లక్ష్మన్న, శ్రీను, దాసు, నారాయణ, రామచంద్రయ్య, ఖాదర్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

చర్మకారులపై అధికారుల వేధింపులు సరికాదు



తొలగించిన షెడ్లను పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

వనపర్తి రూరల్: పట్టణంలోని మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ ఎదుట షెడ్లు నిర్మించుకొని చెప్పులు కుట్టి జీవించే చర్మకారులపై మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్, సిబ్బంది ప్రతాపం చూపించడం సరికాదని సీపీఐ పట్టణ కార్యదర్శి రమేష్, జిల్లా నాయకులు గోపాలకృష్ణ అన్నారు. శనివారం పట్టణంలోని మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ వద్ద మున్సిపల్ సిబ్బంది తొలగించిన చర్మకారుల షెడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ కాంప్లెక్స్ వద్ద డ్రెయినేజీ నిండిదనే కారణంతో 20 ఏళ్ల నుంచి షెడ్లు నిర్మించుకొని జీవనం సాగిస్తున్న చర్మకారుల షెడ్లను తొలగించి వారి జీవనోపాధిని పోగొట్టడం ఎంతవరకు సమజసమని ప్రశ్నించారు. షెడ్లను తొలగించకుండా డ్రెయినేజీని శుభ్రం చేసే అవకాశం ఉన్నా షెడ్లను తొలగించారు. రాజీవ్‌చౌక్, అంబేడ్కర్‌చౌక్, కొత్తబస్టాండ్, జూనియర్ కాలేజీ రోడ్డు, వివేకానంద చౌరస్తాలో డ్రెయినేజీపై పెద్ద పెద్ద షాపుల యజమానులు మెట్లు నిర్మించిన కారణంగా డ్రెయినేజీలు బ్లాక్ అయిన మెట్లను తొలగించమని అధికారులను ఎందుకు అడగడం లేదన్నారు. కార్యక్రమంలో కార్మికులు శాంతయ్య, వెంకటేశ్వర్లు, నజీర్, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

దళిత ఉపాధ్యాయులపై సస్పెన్షన్ ఎత్తివేయాలి

పాన్‌గల్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దళిత ఉపాధ్యాయుల సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని, విద్యార్థుల సమక్షంలో నిజనిర్ధారణ కమిటీ ఏర్పాటు చేయాలని ఎంఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నందె కార్తీక్, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పవన్‌కుమార్, బీఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి దాసు డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయా విద్యార్థి సంఘాల నాయకుల ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని నిరసన తెలిపారు. అనంతరం పాఠశాల హెచ్‌ఎం విజయ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గంధం లక్ష్మయ్య, కళ్యాణ్, రామకృష్ణ, స్వామి, ప్రభాస్, తరుణ్, వినోద్, శ్రీను, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల విడుదల



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

పాన్‌గల్: ఈనెల 23న నిర్వహించే సీపీఐ శత వార్షికోత్సవాలను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీరామ్ అన్నారు. శనివారం మండలంలోని కేతేపల్లిలో పార్టీ శత జయంతి ఉత్సవాల కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో నిర్వహించే పార్టీ శత జయంతి ఉత్సవాలకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాలనర్సింహ ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారన్నారు. కార్యక్రమంలో కుర్మయ్య, పెద్ద హన్మంతు, చిన్ననారాయణ, కాశన్న, కుర్వహన్మంతు, లక్ష్మీనారాయణ, చిన్నరాముడు, సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి నోచుకోని 'వీవర్స్ కాలనీ'



కూలిపోయిన డ్రెయినేజీని చూపిస్తున్న బొబ్బిలి నిక్సన్

కొత్తకోట: మండలంలోని వీవర్స్ కాలనీలో ఏళ్లుగా పాలకులు మారినా అభివృద్ధికి నోచుకోవడం లేదని సీపీఎం మండల కార్యదర్శి బొబ్బిలి నిక్సన్ ఆరోపించారు. శనివారం వీవర్స్ కాలనీలో సీపీఎం ఆధ్వర్యంలో సర్వే నిర్వహించగా.. 35 ఏళ్ల నుంచి కాలనీలో నివాసం ఉంటున్న చేనేత కార్మికులకు పెన్షన్ సౌకర్యం, పక్కా గృహాల నిర్మాణం, బీటీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణాలు చేపట్టకపోవడంతో కాలనీవాసులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. మాజీ ఎమ్మెల్యే రావుల చంద్రశేఖర్‌రెడ్డి ద్వారా వాటర్ ట్యాంక్ నిర్మాణం, డ్రెయినేజీ నిర్మాణం, కమ్యూనిటీ హాల్ నిర్మించారని ఆయన తెలిపారు. 30 ఏళ్ల పైబడిన డ్రెయినేజీ నిర్మాణం కూలిపోవడంతో మురుగు, చెత్తా చెదారం ఎక్కడపడితే అక్కడ పడడంతో దుర్వాసన, దోమల బెడద అధికమవుతుందని కాలనీవాసులు వాపోతున్నారన్నారు. మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.5 లక్షలు కేటాయించామని చెప్పిన హామీ అమలుకు నోచుకోవడం లేదన్నారు. మాయా మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఉన్న నిధులతో అభివృద్ధి పనులు చేయడం లేదని ఆయన ఆరోపించారు. కార్యక్రమంలో రాములు, సత్యనారాయణ, రాజు, శేఖర్, నరసింహులు, శరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాన్షీరాం సేవలు మరువలేనివి

వనపర్తిటౌన్: అంబేడ్కర్ ప్రబోధాలను ఆచరించి రాజ్యాధికారానికి ఎదిగేలా చేసిన బహుజన పితామహుడు కాన్షీరాం అని ప్రజావాగ్గేయకారుడు రాజారాంప్రకాశ్ కొనియాడారు. కాన్షీరాం 91వ జయంతిని పురస్కరించుకొని శనివారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో మహనీయుల స్ఫూర్తి వేదిక ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గిరిరాజయ్యచారి, నాయకంటి నరసింహశర్మ, బాలేమియా, కుర్మయ్య, నాగరాజు, యేసేపు, శాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

వనపర్తి రూరల్: మండలంలోని పీర్లగుట్ట, రాజపేట, చిట్యాల, పెద్దగూడెం, అప్పాయిపల్లిలో డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని పట్టణ కార్యదర్శి పరమేశ్వరాచారి, కురుమయ్య కోరారు. వనపర్తి సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పీర్లగుట్ట వద్ద ఉండే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను శనివారం వారు సందర్శించి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని, తాగునీటి నల్లాలు బిగించాలని కోరారు. వీధిలైట్లు లేకపోడంతో రాత్రిపూట విషసర్పాలు, తేళ్లు అధికంగా సంచరిస్తుండడంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారన్నారు. కార్యక్రమంలో జి బాలస్వామి, గంధం గట్టయ్య, నరసింహ, మహమూద్, శ్రీనివాసులు, భాగ్యమ్మ, లక్ష్మి, నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి



మాట్లాడుతున్న కిరణ్

వనపర్తి విద్యావిభాగం: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న బడ్జెట్ సమావేశంలో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రియంబర్స్‌మెంట్ నిధులను తక్షణమే విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి డి.కిరణ్ అన్నారు. శనివారం వనపర్తి జిల్లా కేంద్రంలోని రైతు సంఘం కార్యాలయంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ సమావేశం జిల్లా ఉపాధ్యక్షుడు రాఘవ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా డి.కిరణ్ మాట్లాడుతూ కొఠారి కమిషన్ ప్రకారం విద్యకు రాష్ట్ర బడ్జెట్ 30 శాతం నిధులు, కేంద్ర బడ్జెట్‌లో 10 శాతం నిధులు కేటాయించాలన్నారు. సమావేశంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఎం.ఆది, రామకృష్ణ, వీరన్ననాయక్, మోహన్, ఆంజనేయులు, రాజవర్ధన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ శ్రీనివాస్ బదిలీ

అమరచింత: ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తు న్న శ్రీనివాసులు శనివారం బదిలీపై కొత్తకో టకు వెళ్లినట్లు ఎంపీఓ నరసింహులు తెలిపా రు. కొత్తకోటలో విధులు నిర్వహిస్తున్న ఎంపీ డీఓ చెన్నమ్మ అమరచింత మండల ఎంపీడీఓగా వస్తున్నట్లు వెల్లడించారు. ఏడాదిన్నర కా లంగా ఎంపీడీఓగా విధులు నిర్వహించిన శ్రీనివాసులు గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారంతో పాటు ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణలో చురుకుగా పాల్గొన్నారని తెలిపారు.

క్షయ నిర్ధారణ పరీక్షలు



పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

పాన్‌గల్: క్షయ వ్యాధి రహిత మండలంగా మార్చేందుకు గ్రామానికి వచ్చి వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. శనివారం మండలంలోని అన్నారంలో క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలను ఆయన సిబ్బందితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొబైల్ ఎక్స్‌రే, తెమడ పరీక్షలు చేసుకోవడం ద్వారా వ్యాధి ఉన్నట్లు గుర్తిస్తే వ్యాధిగ్రస్తులకు నిశ్చయ్ పోషణ్ యోజన, ప్రధాన మంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ కింద పౌష్టికాహారం కోసం నెలకు రూ.1000 అందజేస్తారన్నారు. కార్యక్రమంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ వైద్యులు మైథిలి, సీహెచ్‌ఓ రామయ్య, వైద్య సిబ్బంది రాంచంద్రయ్య, మధుబాబు, సతీష్, రేవతి, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.